క్లుప్తంగా

కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మొయినాబాద్‌: కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌కు భరద్వాజ్ కాలనీవాసులు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. భరద్వాజ్ కాలనీలో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేవని రోడ్లపైనే మురుగునీరు పారుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వీధుల్లో చెత్తాచెదారం, రోడ్లపై మురునీటితో ఈగలు, దోమలు చేరి విషజ్వరాల బారిన పడుతున్నామన్నారు. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి కాలనీలో సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో భరద్వాజ్ కాలనీ అసోసియేషన్ సభ్యులు మల్లేశ్‌గౌడ్, కుమార్, జహంగీర్, సలీం, నర్సింలు, రవిరాజు, బాల్‌రెడ్డి, రఘు, రఘురామ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ కమిటీలను నియమించాలి

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంత ఇంటిని కల్పించే ఉద్దేశంతో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను నియోజకవర్గ వ్యాప్తంగా త్వరగా పూర్తిచేయాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ కమిటీలో బీసీ, ఎస్సీ, ఎస్టీతో పాటు ఇద్దరు డ్వాక్రా సంఘాల సభ్యులకు అవకాశం కల్పించాలన్నారు. పూర్తిచేసిన వివరాలను తమ క్యాంపు కార్యాలయంలో అందజేయాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



బాధితుడికి చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాటిందని కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ సూచించారు. మున్సిపాలిటీకి చెందిన సురేశ్‌నాయక్ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. మాజీ మంత్రి పి.సబితారెడ్డి చొరవతో మంజూరైన రూ.25వేల చెక్కును మంగళవారం కౌన్సిలర్ లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవి, తదితరులు పాల్గొన్నారు.

హోంశాఖ మాజీ మంత్రిని కలిసిన చైర్‌పర్సన్



దేవేందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న చైర్‌పర్సన్, బీజేపీ నాయకులు

తుక్కుగూడ: హోంశాఖ మాజీ మంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్‌ను ఇటీవల తుక్కుగూడ పురపాలక సంఘం చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన బరిగెల హేమలతరాజు గౌడ్ దంపతులు మంగళవారం శ్రీనగర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రస్తుత రాజకీయ విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, కౌన్సిలర్లు శివకుమార్, ఆర్.రాజు, నాయకులు సుధాకర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట్‌: బాలాపూర్‌కు చెందిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌ను బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా నియమించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీఎస్పీ ముఖ్య నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ జాతీయ నేతలు, రాష్ట్ర పార్టీ నాయకులు కలిసి శేఖర్‌ను రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం శేఖర్ మాట్లాడుతూ.. నియామకానికి పూర్తి సహకారం అందించిన పార్టీ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

బాబోయ్ కుక్కలు

వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న శునకాలు

- రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్న ప్రజలు
- మనుషులు, జంతువులపై దాడులు
- పట్టించుకోని అధికారులు

షాబాద్/మొయినాబాద్‌రూరల్: మండల కేంద్రాల్లో శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రీ, పగలు అనే తేడాలేకుండా కనిపించిన వారిపై విచక్షణారహితంగా దాడిచేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో వీధుల్లో తిరగాలంటే ప్రజలు జంకుతున్నారు. రాత్రుల్లో ఇళ్లకు చేరుకోవాంటే ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులను వెంట పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కొన్ని నెలలుగా వీటి బెడద ఎక్కువైంది. జీపీ పాలకవర్గం, అధికారులు స్పందించి శునకాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని నాగరగూడ, పోతుగల్, తాళ్లపల్లి, రుద్రారం, హైతాబాద్, షాబాద్, సర్దార్‌నగర్ తదితర గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ స్థానికులను గాయపరుస్తున్నాయి. పిల్లలను పాఠశాలలకు పంపించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరచూ ఘటనలు..

మండలంలో తరచూ వీధికుక్కల దాడులు జరుగుతున్నాయి. ఇటీవల నాగరగూడ, తాళ్లపల్లి, షాబాద్, పోతుగల్ గ్రామాల్లో 5 మందిపై కుక్కలు తీవ్రంగా దాడి చేశాయి. అదేవిధంగా గత నెలలో ఓ రెండేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేయడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. రేగడిదోస్వాడ, తిమ్మారెడ్డిగూడ, చందనవెల్లి గ్రామాల్లో గొర్రెలు, మేకలపై దాడి చేయడంతో అవి మృతి చెందాయి. పలు గ్రామాల్లో రోడ్ల వెంబడి వెళ్లే వాహనదారులను వెంబడించడంతో కిందపడి గాయాలపాలయ్యారు. వీధికుక్కలు ప్రజలతో పాటు మేకలు, గొర్రెలు, గేదెలపై సైతం దాడులు చేస్తున్నాయి. దీంతో కొన్నిసార్లు మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి.

మాంసాహారం అలవాటుతో..

మొయినాబాద్ మండలంలోని హిమాయత్‌నగర్‌తో పాటు అజీజ్‌నగర్, అమ్డాపూర్, మొయినాబాద్, కనకమామిడి తదితర గ్రామాల్లో కుక్కల బెడద అధికమైందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో చికెన్ సెంటర్లు, మటన్ షాపుల వద్ద మాంసాహారం వాసనకు కుక్కలు రోడ్లపై వీరంగం సృష్టిస్తున్నాయి. ఇప్పటికే చాలా గ్రామాల్లో ఎంతో మంది కుక్కల దాడికి గురయ్యారని, అదేవిధంగా మేకలు, గొర్రెల మందలపై దాడి చేసిన సంఘటనలు చాలా ఉన్నాయని పేర్కొంటున్నారు. అధికారులు గ్రామాల్లో ఉన్న కుక్కలను తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ కాలనీలో కుక్కల సంచారం

చీకటిపడితే అంతే సంగతులు

ఆలస్యంగా పనులు ముగించుకొని అర్ధరాత్రి నివాసాలకు వచ్చే వారిపై, రాత్రిపూట వాహనాలపై వెళ్తున్న వారిని వెంబడించి మరీ దాడులు చేస్తున్నాయి. తెల్లవారుజామున పొలాలకు వెళ్లే రైతులు, వాకింగ్ చేసే వారితో పాటు పనుల కోసం బయటకు వెళ్లే వారిపై సైతం వీధి కుక్కలు గుంపులుగా వచ్చి దాడి చేసి గాయపర్చుతున్నాయి. ఇప్పటికే గతంలో ఇలాంటి సంఘటనలు జరిగాయి.



షాబాద్‌లో రోడ్లపై సంచరిస్తున్న ఊరకుక్కలు

పట్టించుకోవడం లేదు



నాగరగూడ, బోడం పహడ్, పోతుగల్ మధ్యన నిత్యం శునకాలు రెచ్చిపోతూ ప్రజలపై దాడులు చేస్తున్నా అధికారులు ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజల నుంచి ఎన్ని ఫిర్యాదులు వెళ్లిన పట్టించుకోవడం లేదు. కుక్కల బెడదతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. వీటి నివారణకు సిబ్బంది చర్యలు తీసుకోవాలి.

–ఎండీ ఇనాయత్, బోడంపహాడ్, షాబాద్

చర్యలు తీసుకుంటున్నాం



కుక్కల బెడదను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నాం. దీనిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గ్రామాలు, మండల కేంద్రాల్లో తిరిగే కుక్కలను గుర్తించి పట్టుకుంటాం. మిగిలిన వాటి కోసం పంచాయతీ సిబ్బంది గాలిస్తున్నారు. కుక్కల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

–ఎంపీఓ శ్రీనివాస్ షాబాద్

ఫిర్యాదులు చేశాం



హిమాయత్‌నగర్ గ్రామంలో కుక్కల బెడద అధికమైందని వీటిని తీసుకెళ్లాలని వెటర్నరీ అధికారులకు ఫిర్యాదులు చేశాం. అధికారులు మాత్రం పైఅధికారులకు తెలపాలని పేర్కొంటున్నారు. హిమాయత్‌నగర్‌లో కుక్కల బెడద అధికమై అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసిన మాట నిజమే. ఈ కుక్కలను తొలగించే మార్గం కోసం పైఅధికారులను సంప్రదిస్తున్నాం. సమస్య పరిష్కరించేలా కృషి చేస్తాం.

–సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి, హిమాయత్‌నగర్

వీధికుక్కల బెడదను నియంత్రించాలి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలోని భవానీనగర్ కాలనీలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో కాలనీవాసులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. వారంరోజుల క్రితం ఓ ఇంటి సమీపంలో కుక్క ప్రసవించడం(ఈనడం)తో ఈ సమస్య మరింత ఎక్కువైంది. వారంరోజుల క్రితం అటువైపు వెళ్తున్న శివకుమార్ అనే వ్యక్తిని కుక్క కాటు వేయడంతో ఆయన ఆస్పత్రి పాలయ్యారు. దీనిపై అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడదను నియంత్రించాలని కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. మున్సిపాలిటీలో ఇప్పటివరకు 180 కుక్కలకు స్టెరిలైజ్ చేశామని, మిగిలిన వాటిని చేస్తున్నామన్నారు. భవానీనగర్ కాలనీ సమస్యపై ఇప్పటికే మున్సిపల్ సిబ్బందికి, పశు వైద్యాధికారికి సమాచారం అందించామని, పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను సకాలంలో రాకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ప్రభుత్వం చొరవ తీసుకొని కళాశాల యాజమాన్యాలతో మాట్లాడి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. డిగ్రీ కళాశాల యాజమాన్యాలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరవధిక సమ్మెకు ఎస్ఎఫ్ఐ పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. ప్రభుత్వం డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరపాలని, లేనియెడల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరమ్మ

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వీరసముద్రం గ్రామంలో మంగళవారం ప్రపంచ మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి వెంకటేశ్వరమ్మ హాజరై మాట్లాడారు. 78 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో మహిళలపై దాడులు, మానసిక, శారీరక వేధింపులు, హత్యలకు గురికావడం వంటి సంఘటనలు అనునిత్యం ఏదో ఒకచోట జరుగుతూనే ఉన్నాయన్నారు. ఎన్ని చట్టాలు తెచ్చిన ఈ సంఘటనలు ఆగడం లేదన్నారు. మహిళల్లో చైతన్యం వస్తేనే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. అప్పుడే మహిళలపై దాడులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో మంజుల, భాగ్యమ్మ, కృష్ణవేణి, మానస, అనిత, యాదమ్మ పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం అబ్దుల్ కలాం



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి, అధ్యాపకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: నేటి యువత ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీవర్ధన్‌రెడ్డి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏపీజే అబ్దుల్ కలాం నిరుపేద కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యలు అభ్యసించి దేశ అత్యున్నత పదవిని అలంకరించారన్నారు. అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విఠ్యాల పాఠశాలలో

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఆవుల రవి ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు

ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్న ప్రభుత్వాలు

- నేవీ రాడార్ ఏర్పాటును అడ్డుకోవాలి
- బీఆర్ఎస్ నేతలు అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి

మొయినాబాద్: దామగుండంలో నేవీ రాడార్ సెంటర్ ఏర్పాటు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నాయని బీఆర్ఎస్ నేతలు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పచ్చదనంతో ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేస్తున్నాయన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో సుమారు 2900ల ఎకరాల్లో వివిధ రకాల ఔషధ మొక్కలు, పెద్ద పెద్ద వృక్షాలు లక్షల్లో ఉన్నాయన్నారు. నేవీ రాడార్ ఏర్పాటుతో చెట్లన్నీ ధ్వంసమవుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలపై కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. నేవీ రాడార్ సెంటర్ ఏర్పాటుతో దామగుండం భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దామగుండంలో నేవీ రాడార్ ఏర్పాటుతో లక్షల చెట్లు ధ్వంసమవుతాయని, ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. నేవీ రాడార్ ఏర్పాటుకు కేంద్ర మంత్రితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు శ్రీహరి, సుధాకర్‌యాదవ్, మాజీ ఎంపీటీసీలు మాణిక్‌రెడ్డి, శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, రావుఫ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహాగౌడ్, యువజన విభాగం మండల అధ్యక్షుడు పరమేశ్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు రాజు, షేక్‌అమీర్, ఖయూమ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు



చేవెళ్ల: పలుగుట్టలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి శిరీష



షాబాద్: మద్దూరులో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

పశువులకు టీకాలు వేయించాలి

చేవెళ్ల: పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం అందించే ఉచిత టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ శిరీష తెలిపారు. మండలంలోని పలుగుట్ట గ్రామంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో నెలరోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. చేవెళ్ల పశువైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటించి ఈ టీకాలు వేస్తారని చెప్పారు. పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందు జాగ్రత్త చర్యగా ప్రభుత్వం ప్రతీ ఏడాది ఈ కార్యక్రమాన్ని చేపట్టి ఉచితంగానే టీకాలు వేస్తోందన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతీ గ్రామానికి వచ్చే పశువైద్య సిబ్బందికి సహకరించి మీ వద్ద ఉన్న పశువులకు ఈ టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభ దశలోనే గుర్తించాలి

శంకర్‌పల్లి: పశువుల్లో ఏ వ్యాధి అయిన ప్రారంభదశలోనే గుర్తించి, సరైన చికిత్స అందించాలని మండల పశువైద్యాధికారి మానస అన్నారు. మంగళవారం పట్టణంలో గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి పశువులకు టీకాలు వేశారు.

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మద్దూరు, తిర్మలాపూర్, కుమ్మరిగూడ, కక్కులూరు గ్రామాల్లో సిబ్బందితో కలిసి పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

బాధితుడికి సాయం

చేవెళ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిని మండల బీజేపీ నాయకులు పరామర్శించారు. ఇటీవల మండలంలోని మీర్జాగూడ గ్రామానికి చెందిన జె.కుమార్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడిని మంగళవారం చేవెళ్లకు చెందిన బీజేపీ యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డిలు పరామర్శించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. నాయకుడు వైభవ్‌రెడ్డి తనవంతుగా వైద్యఖర్చుల కోసం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు వైభవ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చేవెళ్లకు చెందిన పలువురు కూడా తమవంతు సహాయంగా ఆన్‌లైన్ ద్వారా బాధితుడికి ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట యువకులు, తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య



కేశంపేటలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న బాబయ్య



షాబాద్: హైతాబాద్‌లో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న నాయకులు

కేశంపేట: బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు రొల్ల రఘురాంగౌడ్ అధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబయ్య పాల్గొని పలువురికి సభ్యత్వ నమోదు చేయించారు. అదేవిధంగా మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ యువ నాయకుడు కుమ్మరి మహేశ్‌కుమార్ పాల్గొని పలువురికి సభ్యత్వ నమోదును అందించారు. ఆయా కార్యక్రమాల్లో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మోటే శ్రీనివాస్, యుగేందర్, శివాజీ, కరేడ్ల నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్, యాదయ్య, పర్వతాలు, మధుసూదన్‌గౌడ్, పవన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై ఇంటింటి ప్రచారం చేయాలి

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రంగంపల్లి గ్రామంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పిట్టల సురేశ్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

కొందుర్గు: అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పీఎం మోదీ సమర్థవంతమైన పాలన కొనసాగిస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఉత్తరాసిపల్లి, ముట్పూర్ గ్రామాల్లో పర్యటించి ఇంటింటికీ తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్, విజయ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, అభిలాశ్, మహేందర్, శివకుమార్, అనీల్, సురేశ్, రామకృష్ణ, సాయిరాం పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో సత్తాచాటాలి

షాబాద్: బీజేపీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలు సత్తాచాటాలని పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కిరణ్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని హైతాబాద్, నాన్‌చెర్‌ఖాన్‌పేట్, లింగారెడ్డిగూడ, సాయిరెడ్డిగూడ గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ఆకర్షితులై నేడు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున తమ పార్టీలో సభ్యత్వం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో దళిత మోర్చా అధ్యక్షుడు మహేందర్, నాయకులు రాఘవేందర్, శ్రీనివాస్, హరికృష్ణ, శ్రీను, రాజీవ్‌రెడ్డి, కృష్ణచారి, కుమార్ తదితరులు ఉన్నారు.